
RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:143 | జూన్ 3, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్ 9701923260



## దేశంలో ఎబోలా కేసులు లేవు

- అయినా అలర్ట్ గా ఉండాలి
- ప్రయాణికులకు మార్గదర్శకాలు
- కేంద్రం ముందస్తు చర్యలు

2లో



## భూ పోరాటానికి సిద్ధం కండి

- మిలియన్ మార్చ్‌ను తలపించేలా ఉండాలి
- జులై 2న ఉప్పల్‌లో భారీ ఉద్యమం
- ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి
- అమరవీరుల త్యాగాలను మరువొద్దు
- తెలంగాణ ఆశయాల సాధన ఇంకా పూర్తి కాలేదు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత పిలుపు

2లో

# తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..





- అమరవీరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్రం
- సంక్షేమం, ఉపాధి, సాగునీటితో సమగ్ర ప్రగతి
- రైతు నుంచి యువత వరకు అందరికీ అండ
- లక్షల ఇళ్లు, వేల ఉద్యోగాలతో ముందడుగు
- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల తెలంగాణ
- ప్రజల సహకారంతో స్వర్ణ తెలంగాణ నిర్మాణం
- ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ పోరాటాలు, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో పాల్గొన్న ఆయన భద్రతా దళాల కవాతును పరిశీలించి పోలీసుల

మిగతా 2వ పేజీలో




# తెలంగాణ.. మీ అయ్య జాగీరా?!

### జనసేన పోటీ ఖాయం

- ఎవరి బెదిరింపులకూ భయపడను..
- తెలంగాణపై నా ప్రేమను ఎవరూ ప్రశ్నించలేరు
- నేను భూ కబ్జా చేస్తే ప్రభుత్వం తీసుకోవచ్చు
- సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ నా కల
- తెలంగాణ వ్యతిరేకిని ఏమాత్రం కాదు
- ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా స్వయంగా పర్యటిస్తా
- ఆంధ్ర-తెలంగాణ విద్వేషాలు కావాలనే రెచ్చగొడుతున్నారు
- హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్

2లో

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనానికి తెరలేపుతూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేస్తూనే, తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో తాను చెరువు భూమిని ఆక్రమించినట్లు నిరూపితమైతే ప్రభుత్వం వెంటనే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవచ్చని ప్రకటించారు. తాను ఎన్నడూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించలేదని, పార్లమెంట్‌లో విభజన జరిగిన తీరును మాత్రమే ప్రశ్నించానని చెప్పిన పవన్.. కొందరు నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.

## నాలుగు కోట్ల ప్రజల జాగీరు

### పవన్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్ : పొన్నం కౌంటర్

2లో

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్!

- 290 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్లు
- ఏఈఈ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీ
- ఈ నెలలోనే మరో 5-6 నోటిఫికేషన్లు
- అక్టోబరులో పరీక్షలు నిర్వహించే అవకాశం
- 3800 పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వ అనుమతి
- సీబీటీ విధానంలో పరీక్షలకు కార్యాచరణ
- పరీక్ష ముగిసిన వెంటనే మార్కులు తెలిసేలా చర్యలు
- సింగిల్ ఫేజ్ నియామకాలపై టీజీపీఎస్సీ దృష్టి
- ప్రతిభా భారతి కార్యక్రమానికి శ్రీకారం

2లో



# అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు

- రైతులు, నిరుద్యోగులు ఇబ్బందుల్లో ఉన్నారు
- ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం విఫలమైంది
- పారిశ్రామిక అభివృద్ధి వెనుకబడింది
- సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్య వైఖరి
- తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తాం
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్
- తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, తప్పుడు హామీలు, విష ప్రచారాలతో అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశ నుంచి వెనక్కి నెట్టిందని అన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు సరైన మద్దతు లేకపోవడం,

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్



## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్!

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ శాఖల్లో మొత్తం 290 పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మూడు నోటిఫికేషన్లు విడుదల చేసింది. రోడ్లు, భవనాల శాఖ సివిల్ విభాగంలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టులు, ఎలక్ట్రికల్ విభాగంలో 49 ఏఈఈ పోస్టులు, కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేయనుంది. సివిల్ విభాగంలోని 222 ఏఈఈ పోస్టులకు ఈ నెల 6 నుంచి జూలై 13 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎలక్ట్రికల్ విభాగంలోని 49 పోస్టులకు జూన్ 8 నుంచి జూలై 15 వరకు, కాలుష్య నియంత్రణ మండలిలోని 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 10 నుంచి జూలై 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ పోస్టుల పరీక్షలు అక్టోబరులో నిర్వహించే అవకాశం ఉందని టీజీపీఎస్సీ తెలిపింది. 2026 జూలై 1 నాటికి 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3,800 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ నెలలోనే మరో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, లీకేజీలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఓఎంఆర్ విధానానికి బదులుగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులు తమ మార్కులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. నియామక ప్రక్రియను వేగవంతం చేయడంపై కూడా టీజీపీఎస్సీ దృష్టి సారించింది. గతంలో ఉద్యోగ నియామకాలకు ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు సమయం పట్టేదని, ఇకపై సింగిల్ ఫేజ్ పరీక్షల ద్వారా 3 నుంచి 6 నెలల్లోనే నియామక ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. యూపీఎస్సీ తరహాలో రాష్ట్రంలో కూడా అభ్యర్థులకు మార్గదర్శకంగా 'ప్రతిభా భారతి' కార్యక్రమాన్ని ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. టీజీపీఎస్సీపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని, అయితే పూర్తిస్థాయి పారదర్శకతతో నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు.

## అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు

**మొదటి పేజీ తరువాయి**

పంటల కొనుగోళ్లలో జాప్యం, ఎరువుల సమస్యలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ వెనుకబడుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఉండేదని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా తెలంగాణ భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశంలో ఎబోలా కేసులు లేవు

### అయినా అలర్ట్ గా ఉండాలి

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

భారతదేశంలో ఇప్పటివరకు ఒక్క ఎబోలా వైరస్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా విదేశీ ప్రయాణికుల కోసం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. గత 21 రోజులలో ఎబోలా ప్రభావిత దేశాలకు వెళ్లిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించుకోవాలని కేంద్రం సూచించింది. అలాంటి ప్రయాణికులు కొంతకాలం స్వీయ నిర్బంధంలో ఉండడం మంచిదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం పొందాలని హెచ్చరించారు. జ్వరం, తీవ్రమైన నీరసం, కండరాల నొప్పులు, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, చర్మంపై దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య శాఖ సూచించింది. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపింది. అవసరమైన సమాచారం కోసం కేంద్ర హెల్ప్‌లైన్ నంబర్ 1075ను సంప్రదించాలని సూచించింది. ప్రస్తుతం డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్నట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు వెల్లడించాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ వైరస్‌కు ఇప్పటివరకు పూర్తి స్థాయి ఆమోదిత టీకా లేదా నిర్దిష్ట చికిత్స అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం పలు ముందస్తు చర్యలు చేపట్టింది. ఎబోలా ప్రభావిత దేశాలకు అనవసర ప్రయాణాలు చేయవద్దని పౌరులకు సూచించింది. అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య పరీక్షలను కట్టుదిట్టం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పరిస్థితిని సమీక్షించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని, అయినప్పటికీ అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, కానీ అప్రమత్తత మాత్రం తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ.. మీ అయ్య జాగీరా?!

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**




తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామానికి తెరలేపుతూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ప్రకటన చేశారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న విమర్శలు, బెదిరింపులు, తెలంగాణపై చేస్తున్న దుష్ప్రచారానికి ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణ తనకు ఎంతో ఆత్మీయమైన నేల అని, ఈ ప్రాంతంపై తనకు ఎనలేని ప్రేమ ఉందని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఉద్దేశపూర్వకంగా తనపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించలేదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన తీరును మాత్రమే ప్రశ్నించానని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంట్‌లో వ్యవహరించిన విధానాన్ని తప్పుపట్టానని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడూ గౌరవించానని, సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ తన కల అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన యువత, అమరవీరుల త్యాగాలకు తనకు అపార గౌరవం ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొందరు తనను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో తాను చెరువు భూమిని ఆక్రమించానంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆ భూమిని పరిశీలించాలని సవాల్ విసిరారు. తాను భూమి ఆక్రమించినట్లు నిరూపితమైతే ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవచ్చని, తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ప్రకటించారు. అధికార పదవుల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి అవ్వాలనే ఆశ తనకు లేదని, ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయాల ఉద్దేశమని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులు ఎప్పటి నుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. అందుకే ఇకపై రాష్ట్రవ్యాప్తంగా స్వయంగా పర్యటించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుందని, ఎవరి బెదిరింపులకు భయపడబోదని హెచ్చరించారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై మాట్లాడతామని, అన్యాయాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా పవన్ భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ జీవించి ఉన్న సమయంలో ఆయనకు అవసరమైన సహాయం చేశానని, ఆయన తనను ఎంతో ఆప్యాయంగా చూసేవారని చెప్పారు. గద్దర్ బతికున్నప్పుడు పట్టించుకోని వారు ఇప్పుడు ఆయన పేరును రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుల తప్పులను ప్రజలపై మోపడం సరికాదని, ప్రాంతీయ ద్వేషాలు దేశ సమగ్రతకు హానికరమని హెచ్చరించారు. తెలంగాణలో పరిశ్రమలు రాకపోయినా, ఉపాధి సమస్యలు ఉన్నా వాటికి ఆంధ్ర ప్రజలను బాధ్యులను చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజలు వేరు, పాలకులు వేరు అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు.

### జనసేన పోటీ ఖాయం

- ఎవరి బెదిరింపులకూ భయపడను..
- తెలంగాణపై నా ప్రేమను ఎవరూ ప్రశ్నించలేరు
- నేను భూ కబ్జా చేస్తే ప్రభుత్వం తీసుకోవచ్చు
- సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ నా కల
- తెలంగాణ వ్యతిరేకిని ఏమాత్రం కాదు
- ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా స్వయంగా పర్యటిస్తా
- ఆంధ్ర-తెలంగాణ విద్వేషాలు కావాలనే రెచ్చగొడుతున్నారు
- హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో పవన్ వ్యాఖ్యలు

## నాలుగు కోట్ల ప్రజల జాగీరు

**వేద న్యూస్, హైదరాబాద్**

- పవన్.. ఓ పెయిడ్ ఆర్టిస్ట్
- బీజేపీ స్క్రిప్ట్ చదువుతున్నారు
- జనసేనాని వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



హైదరాబాద్ గచ్చిబౌలిలో జనసేన నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ' రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. పవన్ కల్యాణ్ మాటల్లో అహంకారం కనిపిస్తోందని విమర్శించిన మంత్రి, 'అవును.. తెలంగాణ మా తాతల, మా అయ్యా జాగీరు కాదు.. ఇక్కడి నాలుగు కోట్ల ప్రజల జాగీరు' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ తక్కువ చేసి మాట్లాడే హక్కు లేదన్నారు. పవన్ కల్యాణ్ రాజకీయంగా వక్రభాష్యం చెప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించిన పొన్నం ప్రభాకర్, 'పవన్ కల్యాణ్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్. నా దగ్గర తగినంత డబ్బు ఉంటే నేను కూడా ఆయనకు ఒక పాత్ర ఇచ్చి నా తరఫున మాట్లాడమని ఎంగేజ్ చేసుకునేవాడిని' అంటూ విమర్శించారు. పవన్‌కు ప్రెస్‌మీట్లలో అందుతున్న చిట్టీలు బీజేపీ నుంచి వస్తున్నాయో, బీఆర్ఎస్ నుంచి వస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. బీజేపీ లేదా బీఆర్ఎస్‌లో ఎవరో ఒకరు ఆయనను రాజకీయ ఆర్టిస్ట్‌గా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ సిద్ధం చేసిన అసంపూర్ణ స్క్రిప్ట్‌ను పవన్ తెలంగాణలో చదువుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో సినీ నటుడిగా ఉన్నప్పుడు వచ్చిన జనాదరణను రాజకీయ బలంగా భావించడం పొరపాటని పేర్కొన్న మంత్రి, '2009, 2014లో వచ్చిన జనం ఇప్పుడు కూడా ఒక నటుడిని చూడటానికే వస్తున్నారు. ఆ క్రేజ్ అంతా తన రాజకీయ బలం అనుకుంటే పొరపాటే' అన్నారు. సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోనే పూర్తి స్థాయిలో రాజకీయ విజయాలు సాధించలేకపోయిన పవన్, తెలంగాణలో ఏం సాధిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. జనసేన సభ నేపథ్యంలో ప్రారంభమైన ఈ రాజకీయ మాటల యుద్ధం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడిని రాజేస్తోంది.

## భూపోరాటానికి సిద్ధం కండి

### తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించే మహత్తర ఉద్యమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యమ ఆశయాల సాధన ఇంకా పూర్తి కాలేదని అన్నారు. వేలాది మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ కోసం పోరాడారని, వారి త్యాగాలను తరతరాలకు గుర్తు చేసే బాధ్యత సమాజంపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జరిగిన ఉద్యమాన్ని ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాలని, జూన్ 2ను కేవలం సెలవు రోజుగా కాకుండా ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించిన కవిత, ఆయన విగ్రహం ఇప్పటికీ రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఆలోచనకు రూపకల్పన చేసిన మహనీయుడైన జయశంకర్‌కు తగిన గౌరవం ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆగస్టు 6న ఆయన జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే విగ్రహ నిర్మాణ వ్యయంతో పాటు నిర్వహణ బాధ్యతను కూడా తెలంగాణ జాగృతి భరిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరమని కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి గౌరవం, గుర్తింపు, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ అంశాలపై ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఆశించామని, కానీ అలాంటి ప్రకటన రాకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఉద్యమకారుల సమస్యలు, భూముల అంశాలపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో భారీ భూపోరాటం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇది ఏ ఒక్క పార్టీ కార్యక్రమం కాదని, తెలంగాణ భవిష్యత్తు కోసం జరిగే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, న్యాయవాదులు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మిలియన్ మార్చ్‌ను గుర్తు చేసే స్థాయిలో ఈ భూపోరాటం జరుగుతుందని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కనిపించిన ప్రజా చైతన్యాన్ని మరోసారి ప్రదర్శించే సమయం వచ్చిందన్నారు. అమరవీరుల కుటుంబాలకు గౌరవం, ఉద్యమకారులకు గుర్తింపు, తెలంగాణ ఆశయాల సాధన కోసం ఈ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

**మొదటి పేజీ తరువాయి**

గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి, వారి త్యాగాల వల్లే రాష్ట్రం సాధ్యమైందని, ఆ స్ఫూర్తితోనే ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 2023న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రత్యేక తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ రైతులకు అండగా నిలిచేందుకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేశామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న, ఇతర పంటలకు కనీస మద్దతు ధర అందిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం నేరుగా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ నీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్న సీఎం, కృష్ణా–గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి ఉత్తర తెలంగాణకు సాగునీరు అందించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల వారు వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని తెలిపారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ లక్షలాది మంది మహిళలను స్వయం ఉపాధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. యువతకు ఉద్యోగాల కల్పనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారదర్శక విధానాలతో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టి రికార్డు స్థాయిలో నియామకాలు పూర్తి చేశామని, రాబోయే రోజుల్లో కూడా నోటిఫికేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని విశ్వసిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విస్తృత చర్యలు చేపట్టామని, వేలాది పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని పేర్కొన్న ముఖ్యమంత్రి, మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 03, 2026

# అమరుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు
- జాతీయ పతాకావిష్కరణ



**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చొప్పదండి బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకుని వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాలని, అమరుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చల్లా అనూష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుండేటి శివశంకర్, జిల్లా నాయకులు మంచికట్ల మల్లేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ నరేష్, జిల్లా కార్యదర్శి గుర్రం సమర్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, పట్టణ ఉపాధ్యక్షుడు తడూరి రామకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో రేకుల ఇల్లు దగ్ధం

- పత్తి, గృహోపకరణాలు అగ్నికి ఆహుతి
- బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించాలని విజ్ఞప్తి

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించి ఓ రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన మీరాల పెద్ద సమ్మయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 7 క్వింటాళ్ల పత్తి, గృహోపకరణాలు, నగదు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, పంచాయతీ కార్యదర్శి రామారావు, యువకులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు.



సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# బడిబాటతో ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన



- విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహార భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం విద్యార్థులకు జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ డిప్లోమా

- మెరిట్ విభాగంలో బంగారు పతకాలు కైవసం
- విద్యార్థులను అభినందించిన కరాటే శిక్షకులు




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కరాటే విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో జగిత్యాల జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో వి. హరిప్రిత్, ఏ. హృషికేష్ ఉత్తీర్ణులై జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ డిప్లొమా సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కరాటే శిక్షకులు రాపోలు సుదర్శన్ మాస్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెరిట్ విభాగంలో బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు ప్రవీణ్ కుమార్ మాస్టర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వం, ఆత్మరక్షణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసానికి కరాటే వంటి విద్యలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్, కరాటే మాస్టర్లు మల్యాల రాజు, పవన్ కళ్యాణ్, నవీన్, విశ్వతేజ, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణ సాకారం

- మలిదశ ఉద్యమకారుడు మహమ్మద్ ఫరీద్‌కు సన్మానం



**వేద న్యూస్, మహబూబాబాద్:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారుడు మహమ్మద్ ఫరీద్‌ను మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఫరీద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు విశేషంగా పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధి కోసం జరిగిన ఉద్యమాలు, త్యాగాలు, దీక్షలు, నిరసనల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన ఉద్యమ సేవలను గుర్తించి సన్మానించిన మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంస్థల్లో జాతీయ జెండా ఆవిష్కరణ

**వేద న్యూస్, రుద్రూర్:**



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, బీజేపీ పార్టీ కార్యాలయం, బస్టాండ్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుని వారికి ఘన నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, తహశీల్దార్ తారాబాయి, ఎస్సై సాయన్న, ప్రజాప్రతినిధులు పత్తి రాము, మేక వెంకన్న, వడ్ల నరేష్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం మండలం వర్ష కొండ గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం ఆధ్వర్యంలో సర్పం చ్ పొనుకంటి చిన్న వెంకట్ తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుని వారికి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటాలని, అమరుల ఆశయాల సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల జయ, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు తుమ్మల నర్సయ్య, బాయి పెద్ద లింగారెడ్డి, దోస నర్సయ్య, ఉపాధ్యాయులు విజయ్ భాస్కర్, రాజేందర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘ సభ్యులు, సీఏలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, మరిపెడ:**




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అనంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన పోరాటాలు, అమరుల త్యాగాలు, రాష్ట్ర ఆవిర్భావ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్, జనార్ధనాచారి, శ్రీశైలం, శౌరి, రమేష్ రెడ్డి, సారయ్య, సురేష్, బాబురావు, అనిత, రాజకుమారి, సుధ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 03 , 2026

# ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

## - జాతీయ జెండా ఆవిష్కరించిన ఈవీ శ్రీనివాస్ రావు



**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆయన తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన ఇవ్వగా, దేశభక్తి గీతాలు, తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఈ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన విద్య, వైద్య, పునరావాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి పిల్లలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు ఈ.వి. శ్రీనివాస్ రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మ, సదానందరావు, కొడం కళ్యాణ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గుంటి స్వప్న, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ నేహాల్, బొల్లం శివ, సంస్థ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## - తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బుచ్చిరెడ్డి



**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమ వారం వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి తెలం గాణ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ అనేక మంది త్యాగాలు, ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మారేపల్లి రవీందర్, చిందం రవి, ఎండీ హైదర్, నిమ్మల రమేష్, రవిపాల్, లడే రాజ్‌కుమార్, మామిడిపల్లి సాంబయ్య, వరదరాజు, మార్కండేయ, రఫీ, ప్రపంచరెడ్డి, కటయ్య, వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవం

## - జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్



**వేద న్యూస్, హనుమకొండ:**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎన్. రవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సేవలలో విశేష కృషి చేసిన సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్ కుమార్, ఫార్మసిస్టులు శీతల్, ఉపేందర్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన శిరీష ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అనంతరం రెడ్ క్రాస్ సేవల విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సమాజ సేవలో రెడ్ క్రాస్ కీలక పాత్ర పోషిస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు, శాశ్వత సభ్యులు బొల్లం శివ, మధు, జి. రవి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## - మండల వ్యాప్తంగా జాతీయ పతాకావిష్కరణ



**వేద న్యూస్, నడికూడ:**

నడికూడ మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాణి జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమర వీరులకు నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో కూడా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## - బైరంపల్లిలో జాతీయ జెండా ఆవిష్కరణ



**వేద న్యూస్, కొందుర్గ్:**

కొందుర్గ్ మండలంలోని బైరంపల్లి గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ పెద్దింటి జంగమ్మ-శ్రీకాంత్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, 1200 మంది విద్యార్థులు సహా అమరవీరుల త్యాగాలు, నాలుగున్నర కోట్ల మంది ప్రజల ఆకాంక్షల ఫలితంగానే 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ ఏర్పాటుతో స్వయంపాలన, రాజకీయ హక్కులు, ఆర్థిక మరియు సామాజిక న్యాయ సాధనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. నీళ్లు-నిధులు-నియామకాలు అనే ఉద్యమ లక్ష్యాల సాధనకు ప్రత్యేక రాష్ట్రం దోహదపడిందని, తెలంగాణ భాష, యాస, సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గడ్డమీది మంజుల మల్లేష్, బీర్ల కృష్ణారాణి, చిన్నబొక్కి నవనీత కృష్ణ, ఎండీ జహంగీర్, కందివనం రమేష్, బావి భీమమ్మ నర్సింలు, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, వినోద్, మున్సిపాలిటీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సోనియా గాంధీ వల్లే తెలంగాణ కల సాకారం

## - సర్పంచ్ కుల్ల పావని యాకాంతం



**వేద న్యూస్, వర్ధన్నపేట:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వెంకట్రావు పల్లె గ్రామ సర్పంచ్ కుల్ల పావని యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతంలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కుల్ల పావని, యాకాంతం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన సోనియా గాంధీ నాయకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను వెంకట్రావు పల్లె గ్రామ సర్పంచ్ కుల్ల పావని,యాకాంతం గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు పల్లె గ్రామ కార్యదర్శి రోజా, ఉపసర్పంచ్ గొలుసుల మహేందర్, గ్రామ వార్డు నెంబర్స్ బండ సరిత, బొల్లం అర్చన శేఖర్, జడ అనిత రాజు, గొట్టం చిరంజీవి, చెన్నా రాజు, బొల్లం కుమారస్వామి, మిట్టపల్లి రమేష్, వివో బొల్లం యాకలక్ష్మి, అంగన్వాడీ టీచర్ చిదుముల్ల సుభద్ర, కముటం సూరయ్య, కారాబార్ చిక్కొండ రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది మిట్టపల్లి సాయిలు, వెంగతల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్



**వేద న్యూస్, వర్ధన్నపేట:**

వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మించిన గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు, వెంకట్రావు పల్లె గ్రామ సర్పంచ్, కుల్ల పావని యాకాంతం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావు పల్లె గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు పల్లె గ్రామ సర్పంచ్ కుల్ల పావని యాకాంతంలు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి కలలను సహకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నాణ్యమైన గృహాలను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి సొంత ఇల్లు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తమకు ఇల్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు చిక్కొండ ఎల్లమ్మ, యాకయ్య మరియు భాషబోయిన స్వరూప రాములు, వెంకట్రావు పల్లె గ్రామ కార్యదర్శి రోజా, ఉప సర్పంచ్ గొలుసుల మహేందర్, గ్రామ వార్డు సభ్యులు, బొల్లం అర్చన శేఖర్, జడ అనిత రాజు, గొట్టం చిరంజీవి, చెన్న రాజు, బొల్లం కుమారస్వామి, మిట్టపల్లి రమేష్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ వలిభాష, వివో అధ్యక్షురాలు బొల్లం యాకలక్ష్మి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు

## - కామారెడ్డిపల్లిలో జాతీయ పతాకావిష్కరణ



**వేద న్యూస్, పరకాల:**

పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భారతీయ జనతా పార్టీ పరకాల రూరల్ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాచబోయిన బాబు యాదవ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల దేవరాజ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నర్సయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల మల్లారెడ్డి, మండల కోశాధికారి ఏదునూరి లింగయ్య, మండల నాయకులు నూటెంకి కొమురయ్య, తండ కుమారస్వామి, దానం ఓదెలు, కొయ్యడ భద్రయ్య, తడుక సురేష్, బూత్ అధ్యక్షులు జన్ను లింగయ్య, ఏకు సదయ్య, రాజయ్య, జన్ను ఓదెలు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి కొత్తగా సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ డి.ఎస్.కె. ధర్మరాజును పలువురు వైద్యులు, ప్రముఖులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ మైదం రాజు, మోదే నాగేందర్ తదితరులు డాక్టర్ ధర్మరాజును పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రి మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఆయుర్వేద వైద్య రంగానికి మరింత ప్రాధాన్యం తీసుకువచ్చేలా సేవలు అందించాలని కోరారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 03 , 2026

## పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయం ప్రారంభం



**వేద న్యూస్, నడికూడ:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నడికూడ మండలం వరికోల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయం, ఎంప్లాయీస్ వర్క్ స్పేస్‌ను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ దొగ్గేల కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం గ్రామ యువత, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అక్షరాస్యత పెంపు, జ్ఞాన విస్తరణ, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అనుకూల వాతావరణం కల్పించడం దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందుబాటులో ఉండటం యువతకు ఎంతో మేలు చేస్తుందన్నారు. గ్రంథాలయం ఏర్పాటు కోసం కృషి చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పోచంపల్లి దేవేందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, రమణారెడ్డి, ఆళ్లెం వంశీకి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మురాల భుజంగరావు, బీఆర్ఎస్ నాయకులు డైగ రాజు, గ్రామ పంచాయతీ సభ్యులు, యువజన నాయకులు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం



**వేద న్యూస్, గంగాధర:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరుల త్యాగాలు మరియు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం వల్లే సాధ్యమైందన్నారు. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో గంగాధర మండలం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ప్యాక్స్ చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

**- ఉత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం కోనేరుపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు, ఆలయ కమిటీ, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, కాట్నపల్లి సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, రాజేందర్ రెడ్డి, సుజిత్ రెడ్డి, వెంకటేష్, అనూష-శ్యామ్‌సుందర్, మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చొద్దు

**- రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచన**



**వేద న్యూస్, నడికూడ:**

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నార్లాపూర్, రాయపర్తి, ధర్మారం గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ మాట్లాడుతూ, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ కర్బనం, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. దీంతో భూమిలో పోషకాల కొరత ఏర్పడి రసాయన ఎరువుల వినియోగం పెరిగి రైతులపై అదనపు భారం పడుతుందని చెప్పారు. పంట అవశేషాలను తరచూ కాల్చడం వల్ల నేల గట్టిపడి, వేర్ల పెరుగుదల దెబ్బతినడంతో పాటు పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా వినియోగించే విధానాలను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూడాలన్న నా కల నెరవేరింది

- అర్హతే ప్రమాణం.. రాజకీయాలకు తావు లేదు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు
- కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా పంపిణీ కార్యక్రమం



**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శాయంపేటలో నిర్మించిన 507 ఇందిరమ్మ రెండు పడకల ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మంగళవారం కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లక్కీ డ్రా విధానంలో పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు పత్రాలను అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇల్లు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కుటుంబాల కళ్లలో ఆనందం చూడాలన్న తన కోరిక నేడు నెరవేరిందన్నారు. నిరాశ్రయ కుటుంబాలకు సొంత గూడు అందించడం కంటే గొప్ప సంతృప్తి మరొకటి లేదని పేర్కొన్నారు. ఇళ్ల పంపిణీలో ఎలాంటి రాజకీయాలకు తావులేదని, అర్హతే ఏకైక ప్రమాణమని స్పష్టం చేశారు. ఇళ్ల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ప్రతి గృహరహిత కుటుంబానికి దశలవారీగా ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఇందిరమ్మ గృహ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడం ప్రభుత్వ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు మంత్రి శాయంపేటలోని రెండు పడకల ఇళ్ల సముదాయాన్ని సందర్శించి నిర్మాణాల నాణ్యత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇళ్ల కేటాయింపు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ

- తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు
- 'జై తెలంగాణ' నినాదాలతో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ గౌరవ సలహాదారు అద్దాలకు నరేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ అమరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదని పిలుపునిచ్చారు. అనంతరం అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన సభ్యులు 'జై తెలంగాణ' నినాదాలతో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఉపేందర్, సంఘ అధ్యక్షుడు నూనావత్ కిషన్, ఉపాధ్యక్షులు నజీర్ పాషా, భద్రం, కార్యదర్శి జానీ, ట్రెజరర్ ఆకుల సైదులు, నామల నరసింహారావు, కత్రంగిరి, గట్ల అంజయ్య, పుట్ల రఘుబాబు, హనుమంతరావు, రాంబాబు, వడ్లకొండ శ్రీను, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు

**- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 8 మంది లబ్ధిదారులు తమ ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై గృహ ప్రవేశాలను ప్రారంభించారు. పయ్యావుల లక్ష్మి, పయ్యావుల లచ్చవ్వ, తిప్పరవేణి లత, తిప్పరవేణి బాలక్ష్మి, కోల మహేశ్వరి, నీలం మౌనిక, ఉమ్మరవేణి లచ్చవ్వ, గొల్లపల్లి నరేష్ కుటుంబాలు తమ కొత్త ఇళ్లలోకి ఆనందంగా ప్రవేశించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకోవడం, వారి ముఖాల్లో ఆనందం చూడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ గృహ నిర్మాణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమకు అందిన ఇళ్లను సక్రమంగా వినియోగించుకోవాలని, గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్గందుల ప్రసాద్, స్థానిక సర్పంచ్ గొడుగు విఠల్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పైనంపల్లిలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పైనంపల్లి గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల నరేష్, ఉపసర్పంచ్ ఉపేంద్ర, వార్డు సభ్యులు కుక్కల పుల్లయ్య, గొర్రె వెంకటరమణ, సావిత్రి, సొసైటీ చైర్మన్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ చైర్మన్ నల్లని మల్లికార్జునరావు, బీజేపీ సీనియర్ నాయకులు సురేపల్లి జ్ఞానరత్నం, గ్రామ పెద్దలు మరగని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు.

వేద న్యూస్
బుధవారం జూన్ 03, 2026

# మండల మార్పు చేయాలని..

- ఆవిర్భావ దినోత్సవం రోజున నిరసన
- మంగళపల్లిని వేములవాడ మండలంలో కలపాలని డిమాండ్
- ఫ్లెక్సీతో వినూత్నంగా నిరసన తెలిపిన గ్రామస్తుడు




**వేద న్యూస్, కోనరావుపేట:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల జీవరత్నం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని కోనరావుపేట మండలం నుంచి వేములవాడ మండలంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లెక్సీ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళపల్లి గ్రామం ప్రస్తుతం కోనరావుపేట మండల పరిధిలో ఉన్నప్పటికీ మండల కేంద్రానికి చేరుకోవడానికి సుమారు 17 నుంచి 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేక గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే సమయంలో వేములవాడ పట్టణం గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో పరిపాలనా, రవాణా పరమైన సౌలభ్యం కోసం మంగళపల్లి గ్రామాన్ని వేములవాడ మండలంలో కలపాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామ ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున చేపట్టిన ఈ నిరసన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ఎడ్యుకేషన్ హబ్‌గా పరకాల అభివృద్ధి

- నాణ్యతతో వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

**వేద న్యూస్, పరకాల:**



పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళ వారం పరకాల పట్టణంలోని రాజు పేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే, పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# ధర్పల్లిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ

**వేద న్యూస్, ధర్పల్లి:**



ధర్పల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని గర్వంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సి.హెచ్. సాయిలు, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్రాజ్, ఐకేపీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ప్రవేశాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి ఫలితం




**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి పట్టణంలోని ఫిల్టర్ బెడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మోడల్ స్కూల్‌లలో సీట్లు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్య శ్రీనివాసాచారి మాట్లాడుతూ, విద్యార్థుల కృషితో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారమే ఈ విజయానికి కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులను పలువురు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రూ.61.50 కోట్లు ఖర్చు చేసినా

# తప్పని తిప్పలు..!



- రూ.61.50 కోట్ల ఎస్‌టీపీ నిర్మాణం..
- పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- 300 ఎకరాల భూములు బీడుగా మారాయని రైతుల ఆవేదన
- 200 మంది అన్నదాతల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం
- పొలాల్లోకి నేరుగా చేరుతున్న పట్టణ మురికినీరు
- అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు
- ప్రభుత్వాలు మారినా సమస్యకు పరిష్కారం కరువు
- ప్రారంభానికి నోచుకోని తుమ్మలకుంట మురికినీటి శుద్ధి కేంద్రం
- తక్షణమే ఎస్‌టీపీ ప్రారంభించాలని రైతుల డిమాండ్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతినగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో నిర్మించిన తుమ్మలకుంట మురికినీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) పనులు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోకపోవడంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.61.50 కోట్ల వ్యయంతో 6 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని నిర్మించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది నిరుపయోగంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొలాలను ముంచెత్తుతున్న మురుగునీరు**

సిరిసిల్ల పట్టణం నుంచి వచ్చే మురుగునీరు శుద్ధి కాకుండానే నేరుగా సమీప వ్యవసాయ భూముల్లోకి చేరుతోంది. దీంతో శాంతినగర్ పరిసర ప్రాంతాల్లోని సుమారు 200 మంది రైతులకు చెందిన 300 ఎకరాల వ్యవసాయ భూములు పూర్తిగా మురుగునీటి మయంగా మారాయి. గత పదేళ్లుగా ఈ భూముల్లో వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు.

**పదేళ్లుగా సాగుకు దూరమైన భూములు**

పొలాల్లోకి నిరంతరం మురుగునీరు చేరుతుండటంతో భూములు సాగుకు అనువుగా లేకుండా పోయాయని రైతులు చెబుతున్నారు. ఒకప్పుడు పంటలతో కళకళలాడిన భూములు ప్రస్తుతం బీడుభూములుగా మారిపోయాయని, కుటుంబాల జీవనోపాధి దెబ్బతిన్నదని వాపోతున్నారు.

**ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు**

సమస్య పరిష్కారం కోసం రైతులు పలుమార్లు మున్సిపల్ అధికారులు, ఎమ్మార్వో, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే ఎస్‌టీపీ ప్రారంభించాలి**

భారీ ప్రజాధనంతో నిర్మించిన మురికినీటి శుద్ధి కేంద్రం ప్రారంభమైతే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి వెంటనే కేంద్రాన్ని ప్రారంభించి రైతుల భూములను, జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉన్న ఎస్‌టీపీ ప్రారంభం కాకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వ భవనాలను స్వాధీనం చేసుకోవాలి

- ఎంపీడీవోకు కాంగ్రెస్ నాయకుల వినతి
- ఫంక్షన్ హాల్, గ్రంథాలయ నిర్వహణపై ఫిర్యాదు



**వేద న్యూస్, నడికూడ:**

మండలంలోని వరికోల్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఫంక్షన్ హాల్‌ను ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో నుంచి స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు మంగళవారం ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఎంపీ నిధులు, ఉపాధి హామీ పథకం, స్థానిక సంస్థల ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఫంక్షన్ హాల్ ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందని, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ హాల్‌ను గ్రామ పంచాయతీ లేదా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ భవనంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పోచంపల్లి ఫౌండేషన్ పేరుతో గ్రంథాలయాన్ని ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ప్రజా ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసమే వినియోగించబడేలా అధికారులు స్పందించాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

- భార్యతో విడాకుల వ్యవహారమే కారణం
- పురుగుల మందు సేవించిన యువకుడు
- కానిస్టేబుల్ శ్రీనివాస్ సాహసంతో తప్పిన ప్రమాదం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొత్త బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో స్థానికంగా కలకలం రేగింది. వేములవాడ మండలం శాత్రాజుపల్లెకు చెందిన అశోక్ వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై వాటర్ ట్యాంక్ ఎక్కాడు. తన భార్యతో విడాకులు ఇప్పించేలా ఓ వ్యక్తి కుట్ర చేశాడని ఆరోపిస్తూ, తాను ఇప్పటికే పురుగుల మందు సేవించానని, ప్రాణాలు తీసుకుంటానని హెచ్చరిస్తూ ట్యాంక్‌పై నుంచి హంగామా సృష్టించాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని యువకుడిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయితే అశోక్ ఎవరినీ దగ్గరకు రానివ్వకుండా నిరాకరించడంతో పరిస్థితి ఉత్కంఠభరితంగా మారింది. ఈ క్రమంలో ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాస్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. చాకచక్యంగా వాటర్ ట్యాంక్ పైకి చేరుకుని ఒక్కసారిగా అశోక్‌ను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇతర సిబ్బంది సహాయంతో అతడిని సురక్షితంగా కిందకు దించారు. పురుగుల మందు సేవించినట్లు చెప్పడంతో వెంటనే అశోక్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. సమయస్ఫూర్తితో వ్యవహరించి యువకుడి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను స్థానికులు, పోలీసు అధికారులు అభినందించారు.

# టీయూఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**వేద న్యూస్, కమలాపూర్:**

కమలాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పబ్బు సతీష్, టీయూఎఫ్ మండల అధ్యక్షుడు మౌటం సంపత్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తుమ్మ శోభన్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్‌తో పాటు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 03 , 2026

# మినీ జీపీఎల్ క్రికెట్ టోర్నీలో విక్రమ్ వైల్డ్ ఫైర్స్ విజేత

**– ఫైనల్లో ఠాగూర్ కింగ్స్‌పై ఘన విజయం**

**– విజేత జట్టుకు రూ.10 వేలు, ట్రోఫీ ప్రదానం**



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండల కేంద్రంలో గొంటి బాలయ్య స్మారకార్థం నిర్వహించిన మినీ జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. గత పది రోజులుగా కొనసాగిన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి. ఫైనల్ మ్యాచ్‌లో విక్రమ్ వైల్డ్ ఫైర్స్ జట్టు ఠాగూర్ కింగ్స్ జట్టుపై విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేయగా, రన్నరప్‌గా నిలిచిన ఠాగూర్ కింగ్స్ జట్టుకు రూ.5 వేల నగదు బహుమతి, ట్రోఫీని ప్రదానం చేశారు. మూడో స్థానంలో నిలిచిన ఏకేఎం జట్టుకు, నాలుగో స్థానంలో నిలిచిన సతీష్ టైటాన్స్ జట్టుకు ట్రోఫీలు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పడాల రాజన్న-భాగ్యలక్ష్మి విజేతలు, రన్నరప్ జట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ఆదరణ పెరగడం సంతోషకరమని, యువ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన గంగాధర క్రికెట్ అసోసియేషన్ సభ్యులను అభినందించిన ఆమె, పోటీల నిర్వహణకు సహకరించిన దూలం సందీప్, సుంకె దీక్షిత్, మల్యాల వినయ్ సాగర్, గౌతమ్ బూర్గుపల్లి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ఠాగూర్, వార్డు సభ్యుడు గొంటి సంజీవ్, వేణు, తిరుపతి, అనిల్, విజయ్, శ్రీను, శ్రీహరి, డీజే సురేష్, ఉప్పి, వివేక్, నరేష్, దీపక్, విక్రమ్, జొన్నల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# టీయూజేఏసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

**– ఉద్యమకారుడు జ్ఞానరత్నంకు సన్మానం**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నెలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు గ్రామంలో టీయూజేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధికార ప్రతినిధి, తెలంగాణ ఉద్యమకారుడు సూరేపల్లి జ్ఞానరత్నంను టీయూజేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర నాయకులు మందడి వెంకటేశ్వరరావు, తీగ రాములు, గుగులోత్ ఆంజనేయులు, సూరేపల్లి జ్ఞానరత్నం, కాకుమాని మల్లికార్జునరావు, సూరగని చిన్న యాకయ్య, మేకల వెంకటేశ్వర్లు, కార్లపూడి కోటయ్య, బానోత్ మోహన్, గుగులోత్ నాగేశ్వరరావు, చింతల మధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో డబ్బు రాజకీయాలు నడుస్తున్నాయి

**– నన్ను సస్పెండ్ చేసే స్థాయి మండల అధ్యక్షుడిది కాదు**

**– సంచలన ఆరోపణలు చేసిన బద్దం ఎల్లారెడ్డి**

**– పైరవీలు, కమీషన్ల రాజకీయాలపై విమర్శలు**

**– ఇల్లంతకుంట కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు బహిర్గతం**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. తనపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడంపై కాంగ్రెస్ నాయకుడు బద్దం ఎల్లారెడ్డి మండల నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "నన్ను సస్పెండ్ చేసే స్థాయి మండల అధ్యక్షుడికి లేదు. పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకులు పైరవీలు, కమీషన్ల రాజకీయాల్లో నిమగ్నమయ్యారు" అని ఆరోపించారు. మండలంలో కొందరు నాయకులు షాడో రాజకీయాలు చేస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. గాలిపల్లి పీఏసీఎస్ చైర్మన్ పదవిని రూ.30 లక్షలకు విక్రయించారని, రైతులను నష్టపరిచిన వ్యక్తులకు పార్టీలో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. పార్టీ కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు లేకుండా, డబ్బు సంచులు మోసేవారికే పెత్తనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ప్రయోజనాల కోసం ప్రశ్నించినందుకే తనపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని పేర్కొన్న ఎల్లారెడ్డి, "జెండా మోసిన పేద కార్యకర్తలు నలిగిపోతున్నారు. నిజం మాట్లాడే గొంతును ఎవరూ అణచలేరు" అని వ్యాఖ్యానించారు. బద్దం ఎల్లారెడ్డి చేసిన ఈ ఆరోపణలు ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారగా, దీనిపై మండల కాంగ్రెస్ నాయకత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# పైనంపల్లిలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

**– జాతీయ జెండా ఆవిష్కరించిన సర్పంచ్ నరేష్**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుక్కల నరేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల పోరాటం, విద్యార్థుల త్యాగాలు, అమరవీరుల బలిదానాల ఫలితంగా ఏర్పడిందన్నారు. తెలంగాణ ఆవిర్భావం స్వాభిమానం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులు అర్పించి, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉపేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శి నరసింహారావు, సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ మల్లికార్జునరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం

**– జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, కోట్లాది ప్రజల ఆకాంక్షలు, ఉద్యమకారుల పోరాట ఫలితంగా ఏర్పడిందని అన్నారు. అమరవీరుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రఘు కుటుంబాన్ని పరామర్శించిన సిరికొండ

**– మృతుడికి నివాళులు.. కుటుంబానికి ఓదార్పు**

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట గ్రామానికి చెందిన సామల రఘు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి మంగళవారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రఘు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సిరికొండ, ఆయన భార్య, ముగ్గురు కుమార్తెలను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రఘు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రం రవీందర్, పొడిచెట్టి గణేష్, బగ్గి రమేష్, అడప ప్రభాకర్, కొత్తగట్టు సాయి, రాజ్ మహమ్మద్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లియాఫీ ఆలిండియా జనరల్ బాడీ సమావేశానికి భారీగా తరలిరావాలి

**– లియాఫీ 1964 వరంగల్ డివిజన్ అధ్యక్షులు పులి సుధాకర్ గౌడ్**



**వేద న్యూస్, కొత్తగూడెం :**

లియాఫీ 1964 ఆల్ ఇండియా జనరల్ బాడీ సమావేశానికి ఏజెంట్లు అధిక సంఖ్యలో తరలిరావాలని ప్రియాఫీ వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షులు అల్లాడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇటీవల వరంగల్ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా టి. సరస్వతి ఎన్నికైన సందర్భంగా ఆమెను బ్రాంచ్ సభ్యులకు పరిచయం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ డివిజన్ అధ్యక్షులు పులి సుధాకర్ మాట్లాడుతూ, జూన్ 17, 18 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న ఆలిండియా జనరల్ బాడీ సమావేశానికి ప్రతి బ్రాంచ్ నుంచి కనీసం 50 మంది ప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షులు అల్లాడి నాగేశ్వరరావు, తమ బ్రాంచ్ నుంచి 50 మందికి తగ్గకుండా ఏజెంట్ మిత్రులను సమావేశానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అదే సందర్భంగా డివిజన్ కమిటీలో ఉప్పలయ్యను సభ్యుడిగా చేర్చినట్లు ప్రకటించారు. అలాగే జూలై నెలలో బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించి, ప్రైమరీ మెంబర్‌షిప్ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏజెంట్ల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రస్తావించారు. ఏజెంట్ల మెడికల్ క్లెయిమ్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజీని రూ.50 లక్షలకు పెంచాలని, ప్రస్తుతం 69 సంవత్సరాల వరకు మాత్రమే అమలులో ఉన్న గ్రూప్ ఇన్సూరెన్స్‌ను ఏజెంట్లు ఎల్ఐసీలో పనిచేసే మొత్తం కాలానికి వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరంగల్ డివిజన్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్, బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, ట్రెజరర్ శంకర్, నిత్యానందం, కె. సుగుణాకర్, ఎస్. రాజేశ్వరరావు, వీరభద్రం, రాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి. సరస్వతికి నాయకులు, సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# మండల వ్యాప్తంగా ఘనంగా ఆవిర్భావ వేడుకలు

**– ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములపల్లి మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ హేమలత, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై డి. వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ, సామాజిక సంస్థల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఏర్పాటుతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 03 , 2026

## తెలంగాణ యాస వచ్చా..? సినిమాల్లో ఛాన్స్ కావాలా..!



**వేద న్యూస్ డెస్క్:**

ఇటీవల 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన నిర్మాణ సంస్థ ఇప్పుడు మరో అర్థవంతమైన, సందేశాత్మక కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. విలక్షణ దర్శకుడు వేణు వుడుగుల, సంధ్యా భాను చల్లా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మధుకర్ రెడ్డి కొమిరెడ్డి కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందనుంది. అన్నదమ్ముల మధ్య విభేదాలు, కుటుంబ కలహాలు అనే సున్నితమైన అంశాన్ని ఈ చిత్రం ప్రధాన కథాంశంగా తీసుకుంది. ఒక కుటుంబం చీలిపోతే కేవలం ఆ ఇంటికే నష్టం జరుగుతుందా, లేక ఆ ప్రభావం మొత్తం గ్రామంపైనే పడుతుందా అనే భావోద్వేగ ప్రశ్న చుట్టూ కథ సాగనుందని చిత్రబృందం వెల్లడించింది. "అన్నదమ్ములు రామలక్ష్మణులా ఉండే రోజులు పోయాయి. ఇప్పుడు రక్తం పంచుకున్న వారే ఒకరిపై ఒకరు నిలబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జమ్మికుంట మట్టిని సాక్షిగా ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన పంచాయితీ ఒక ఇంటి గడపను మాత్రమే కాదు, మొత్తం ఊరి భవిష్యత్తునే మార్చేసింది. చివరకు గెలిచింది ఎవరో తెలియకపోయినా ఓడిపోయింది మాత్రం ఊరేనని" మేకర్స్ విడుదల చేసిన భావోద్వేగ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం నటీనటుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ యాసను సహజంగా మాట్లాడగలిగే వారు, నటనపై ఆసక్తి ఉన్న అన్ని వయసుల వ్యక్తులు తమ ఆడిషన్ వీడియోలను పంపవచ్చని చిత్రబృందం తెలిపింది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆడిషన్ వీడియోలను ఇమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. అయితే సామాజిక మాధ్యమాల్లో చేసే చిన్న వీడియోలను పరిగణనలోకి తీసుకోబోమని, కేవలం సరైన ఆడిషన్ వీడియోలను మాత్రమే పరిశీలిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు. 'రాజు వెడ్స్ రాంబాయి' తర్వాత మరోసారి గ్రామీణ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల ప్రాధాన్యతను ప్రతిబింబించే కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, భాష, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది.

## ఫేక్ కలెక్షన్లకు నో చెప్పిన అర్జున్..!



**వేద న్యూస్ డెస్క్:**

యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా స్వీయ దర్శకత్వంలో, శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'సీతా పయనం' ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ వేదికల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కలెక్షన్లకు సంబంధించి అర్జున్ సర్జా తాజాగా వెల్లడించిన విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చిత్ర ప్రమోషన్స్‌ను నిర్వహిస్తున్న ఒక మార్కెటింగ్ సంస్థ, సినిమా విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.4 కోట్లు వసూలు చేసినట్లు పోస్టర్ విడుదల చేయాలని ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనను తాను వెంటనే తిరస్కరించినట్లు అర్జున్ వెల్లడించారు. వాస్తవంగా అంత మొత్తం తనకు రాలేదని, అలాంటప్పుడు తప్పుడు వసూళ్లతో పోస్టర్లు విడుదల చేయడం సరైంది కాదని ఆ సంస్థ ప్రతినిధులకు స్పష్టంగా చెప్పినట్లు పేర్కొన్నారు. ప్రేక్షకులను తప్పుదారి పట్టించే ప్రచారం తనకు ఇష్టం లేదని కూడా ఆయన తెలిపారు. ఇటీవల సినీ పరిశ్రమలో వాస్తవాలకు విరుద్ధంగా కలెక్షన్ల గణాంకాలను ప్రచారం చేయడం సాధారణంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో అర్జున్ తీసుకున్న నిర్ణయం ప్రత్యేకంగా నిలిచింది. వసూళ్ల విషయంలో నిజాయితీగా వ్యవహరించి ఫేక్ పోస్టర్లకు దూరంగా ఉండటంపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ఆయనను అభినందిస్తున్నారు. సినిమా విజయాన్ని అబద్ధపు సంఖ్యలతో కాకుండా ప్రేక్షకుల ఆదరణతో కొలవాలని అర్జున్ భావిస్తున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో విస్తృతంగా చర్చకు దారితీస్తుండగా, నిజాయితీకి ప్రాధాన్యం ఇచ్చిన అర్జున్ వైఖరిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## తాప్సీ అందాల హవా.. సోషల్ మీడియాలో మళ్లీ సందడి

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగిన తాప్సీ పన్ను మరోసారి వార్తల్లో నిలిచింది. అందం, అభినయం, విభిన్న పాత్రల ఎంపికతో ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న ఈ నటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తన తాజా చిత్రాలతో ఆకట్టుకుంటోంది. 2010లో విడుదలైన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తాప్సీ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. సహజమైన నటన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. ఆ తర్వాత 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'గుండెల్లో గోదారి', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ' వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది. తెలుగు చిత్రాల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, తాప్సీ తన కెరీర్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. వాణిజ్య చిత్రాలతో పాటు కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంపిక చేసుకుంటూ నటిగా తన ప్రత్యేకతను నిరూపించుకుంది. 'పింక్', 'బేబీ', 'ది ఘాజీ అటాక్', 'నామ్ షబానా', 'ముల్క్', 'బద్లా', 'మిషన్ మంగళ్', 'తప్పడ్', 'సాండ్ కీ ఆంఖ్', 'హసీన్ దిల్‌రుబా', 'డుంకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో రూపొందిన చిత్రాల్లో ఆమె నటనకు విశేష ఆదరణ లభించింది. ప్రస్తుతం కూడా తాప్సీ చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు అగ్ర హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు మహిళా కేంద్రిత కథలను ప్రోత్సహిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ తాప్సీ చురుకుగా ఉంటుంది. షూటింగ్ విరామ సమయంలో విదేశీ పర్యటనలు చేస్తూ, అక్కడి అందమైన ప్రదేశాల్లో దిగిన చిత్రాలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటోంది. ఆమె పంచుకునే ప్రతి ఫొటో నెట్టింట వైరల్‌గా మారుతోంది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా చిత్రాలు కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొగసైన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించిన తాప్సీ, తన ప్రత్యేకమైన చిరునవ్వుతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ, ఆమె అందం రోజురోజుకీ మరింత పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. విభిన్న పాత్రలు, బలమైన కథల ఎంపిక, అద్భుతమైన నటనతో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాప్సీ పన్ను, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రేమ-స్నేహం మధ్య 'కాక్‌టెయిల్ 2'




**వేద న్యూస్ డెస్క్:**

బాలీవుడ్‌లో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన 'కాక్‌టెయిల్ 2' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ప్రముఖ నటుడు షాహిద్ కపూర్, ప్రముఖ కథానాయికలు రష్మిక మందన్న, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాన్ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ప్రచార చిత్రం సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాల కలయికగా రూపొందిన ఈ చిత్రం యువతను ఆకట్టుకునేలా ఉండబోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో భారీ విజయాన్ని అందుకున్న 'కాక్‌టెయిల్' చిత్రానికి కొనసాగింపుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. అందమైన విదేశీ ప్రాంతాల నేపథ్యంలో సాగే ఈ కథలో ముగ్గురు వ్యక్తుల జీవితాలు ఎలా మలుపు తిరిగాయనే అంశాన్ని దర్శకుడు ఆసక్తికరంగా చూపించబోతున్నట్లు ప్రచార చిత్రం ద్వారా స్పష్టమవుతోంది. ఒకవైపు ప్రేమ, మరోవైపు స్నేహం మధ్య చిక్కుకున్న పాత్రల భావోద్వేగ ప్రయాణం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రచార చిత్రంలో షాహిద్ కపూర్, రష్మిక మందన్న ప్రేమికులుగా కనిపిస్తుండగా, కృతి సనన్ వారి జీవితాల్లో కీలక పాత్ర పోషించే యువతిగా కనిపిస్తోంది. మొదట స్నేహంగా ప్రారంభమైన వారి అనుబంధం క్రమంగా సంక్లిష్టమైన ప్రేమకథగా మారినట్లు చూపించారు. ఈ ముగ్గురు పాత్రల మధ్య ఏర్పడే సంఘర్షణలు, భావోద్వేగాలు, అపార్థాలు కథను ముందుకు నడిపే ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. ఈ చిత్రంలో రష్మిక మందన్న తన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తుండగా, షాహిద్ కపూర్ తన అనుభవంతో పాత్రకు బలాన్ని చేకూర్చినట్లు తెలుస్తోంది. కృతి సనన్ కూడా భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముగ్గురు ప్రధాన తారల నటన సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. చిత్ర ప్రచారంలో మరో విశేషం సంగీతం. తొలి భాగంలో విశేష ఆదరణ పొందిన ప్రముఖ గీతాన్ని కొత్త రూపంలో వినిపించడం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

## పసుపు రంగు దుస్తుల్లో మెరిసిన తమన్నా..


**వేద న్యూస్ డెస్క్:**



దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పసుపు రంగు మాక్సీ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణతకు, హుందాతనానికి ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఎంచుకున్న ఈ దుస్తులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. లేత పసుపు రంగులో రూపొందిన ఈ దుస్తులు వేసవి కాలానికి అనువుగా ఉండటమే కాకుండా, తమన్నా వ్యక్తిత్వానికి మరింత అందాన్ని చేకూర్చాయి. భుజాలపై సున్నితంగా అమర్చిన పట్టీలు, శరీరాకృతికి సరిపోయే విధంగా రూపొందించిన పైభాగం, కిందికి వెళ్లే కొద్దీ అలల మాదిరిగా కనిపించే పొరలు ఈ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నడుస్తున్న సమయంలో దుస్తులు అందించే సహజమైన కదలిక ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని జోడించింది. తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు తమన్నా సాదాసీదా శైలినే ఎంచుకుంది. అతిగా అలంకరణలకు దూరంగా ఉంటూ, సున్నితమైన మేకప్‌తో సహజమైన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే సాధారణ హెయిర్ స్టైల్‌తో తన మొత్తం రూపాన్ని సమతుల్యంగా మలిచింది. ఆమె ధరించిన ఆభరణాలు కూడా అధిక ఆడంబరానికి దూరంగా ఉండి, క్లాసిక్ శైలిని ప్రతిబింబించాయి. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తమన్నా విజయవంతంగా ముందుకు సాగుతోంది. 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో ఆమె ప్రారంభించిన ఆభరణాల వ్యాపారం క్రమంగా విస్తరిస్తోంది. ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వజ్రాభరణాలను వివిధ కార్యక్రమాల్లో ధరించడం ద్వారా ఆమె తన బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకువస్తోంది.

## 'పెద్ది' జాతరకు రంగం సిద్ధం

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రంపై అభిమానుల్లో నెలకొన్న అంచనాలను మరింత పెంచుతూ చిత్ర బృందం ప్రత్యేక ప్రయాణ వీడియోను విడుదల చేసింది. సినిమా ప్రారంభం నుంచి ఇప్పటివరకు సాగిన ప్రయాణాన్ని ఈ వీడియోలో చూపిస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. రామ్ చరణ్ రగ్గడ్ లుక్, గ్రామీణ నేపథ్యంలో సాగే భావోద్వేగ కథనం, బుచ్చిబాబు సనా ముద్ర ఈ చిత్రంపై మొదటి నుంచే భారీ అంచనాలు ఏర్పరిచాయి. తాజాగా విడుదలైన వీడియోలో ఆ అంచనాలకు తగ్గట్టుగానే చిత్ర నిర్మాణ విశేషాలను, ప్రధాన ఘట్టాలను ఆవిష్కరించారు. ముఖ్యంగా సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'చికిరి చికిరి' పాట చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆ పాట చిత్రీకరణకు సంబంధించిన దృశ్యాలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన క్షణాలను వీడియోలో ప్రత్యేకంగా చూపించారు. ఈ గీతం ఇప్పటికే అభిమానుల్లో విశేష ఆదరణ పొందింది. ఇటీవల భోపాల్‌లో నిర్వహించిన భారీ సంగీత, ప్రీ-రిలీజ్ వేడుకకు సంబంధించిన దృశ్యాలు కూడా వీడియోలో చోటు చేసుకున్నాయి. ఆ కార్యక్రమంలో రామ్ చరణ్‌తో పాటు జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సనా, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ పాల్గొని అభిమానులను అలరించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ విభిన్న క్రీడాకారుడి పాత్రల్లో కనిపించనున్నాడు. క్రికెటర్, పరుగుల వీరుడు, పహల్వాన్ రూపాల్లో ఆయన నటన సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ప్రయాణ వీడియో చూస్తే థియేటర్లలో ఈ సినిమా సందడి ఏ స్థాయిలో ఉండబోతోందో స్పష్టంగా అర్థమవుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073